క్లుప్తంగా

సీతారాముల విగ్రహాల ప్రతిష్ట రేపు

సోమందేపల్లి: మండలంలోని చిన్న బాబయ్యపల్లిలో ఈనెల 27న సీతారాముల విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దాదాపు రూ.60 లక్షలతో నూతనంగా రామ మందిరాన్ని నిర్మించారు. అందులో భాగంగా శనివారం ఆలయం వద్ద గంగపూజ, గోపూజలు చేశారు. మరో రెండు రోజుల పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మడకశిర: పట్టణంలోని 20 వార్డుల్లో శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తదితరులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కోటవీధి వార్డు సచివాలయ పరిధిలో పరిసరాల శుభ్రతపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు చూపిస్తున్నామన్నారు. అయితే కూలీలు పనులకు వచ్చేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్క కూలీ పనికి వచ్చేలా చూడాలన్నారు. అదే విధంగా జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నారు. చేసిన పనులకు త్వరిగతిన బిల్లులు అందిస్తామని వెల్లడించారు.

కర్ణాటక మద్యంతో పట్టుబడిన మహిళ

రొద్దం: మండల పరిధిలోని ఆర్ లోచెర్ల గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తూ రామాంజినమ్మ అనే మహిళ పట్టుబడినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. కర్ణాటక మద్యం పాకెట్లు విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. మహిళపై కేసు నమోదు చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు రాజేశ్వరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


నిర్మాణాలపై ఆరా తీస్తున్న అధికారులు

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో శనివారం హౌసింగ్‌డే నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటి వరకూ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే ప్రారంభించాలన్నారు. లేని పక్షంలో అలాంటి వారి ఇళ్ల పట్టాలను తహసీల్దార్ రద్దు చేసి మరో లబ్ధిదారుడికి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం నుంచి పునాదులు నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు రంగస్వామి నాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల పంపిణీ

పావగడ: తాలూకా వ్యాప్తంగా అంబేడ్కర్, మహర్షి వాల్మీకి, లంబాణి, బోవి (వడ్డెర) అభివృద్ధి మండలిలోని 50 మంది లబ్ధిదారులకు సబ్సిడీ ధరతో ద్విచక్ర వాహనాలను స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప శనివారం అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం భూపూరు గ్రామం వద్ద సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించే బీకే హళ్ళి–పావగడ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ట్రాక్టర్ సీజ్

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ వద్ద ఉన్న చిత్రావతి నదిలో శనివారం సాయంత్రం ఇసుకను అక్రమంగా రవాణా చేసే ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్రావతిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్ కొడికొండ గ్రామానికి చెందిన అనిల్‌కు చెందినదిగా గుర్తించి, కేసు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

సీఎం జగన్ మేలు మరువలేం


హిందూపురం: బెంగళూరు రోడ్డులో ర్యాలీ చేస్తున్న వాల్మీకులు


రొళ్ల: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం..


రొద్దంలో వాల్మీకుల సంబరాలు..

- వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేరుస్తూ చేసిన తీర్మానంపై హర్షం
- సంబరాలు చేసుకున్న వాల్మీకులు, దళిత క్రైస్తవులు

హిందూపురం: వాల్మీకుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శనివారం బోయపేటలోని వాల్మీకి విగ్రహం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫార్సు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. థ్యాంక్యూ సీఎం అంటూ వాల్మీకులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు పలువురు వాల్మీకి నాయకులు మాట్లాడారు. గత టీడీపీ వాల్మీకులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేశారన్నారు. ముఖ్యంగా వాల్మీకులకు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి పదవులతో పాటు ఎమ్మెల్సీలు మున్సిపల్, జెడ్పీ చైర్మన్లుగా అవకాశం కల్పించారని కొనియాడారు. వాల్మీకులంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగమణి, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర(అగళి): వాల్మీకి, బోయ కులస్తులను ఎస్టీలుగా, దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని వాల్మీకి నాయకులు కొనియాడారు. అగళిలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి వాల్మీకి, బోయ కులస్తులు, దళిత క్రిస్టియన్లు క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, వైస్ ఎంపీపీ గాయిత్రి, వాల్మీకి, బోయ సంఘం నాయకులు లింగరాజు, శ్రీనివాస్, హేమంత్‌రాజ్, గోవిందప్ప, నారాయణ, రమేష్, పాండురంగప్ప, ఓబన్న, మారుతి, డీలర్ శ్రీనివాస్, ఇరిగేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం హర్షణీయమని పలువురు కొనియాడారు. శనివారం వాల్మీకులు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాగాకు రామచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని దాదాపు 70 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వాలకు వినతి పత్రాలు ఇవ్వడం, ముఖ్యమంత్రులను కలిసి పోరాటాలు చేయడం జరిగిందన్నారు. అనేక ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి, చేతులు దులుపుకున్నాయని తెలిపారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం ఐదు నెలల్లోనే ఏకసభ్య కమిటీ వేసి, రిపోర్టు తెప్పించుకుని తీర్మానం చేశారు. కేంద్రంతో మాట్లాడి రాష్ట్రంలో బోయలను ఎస్టీల్లో చేర్చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆయన కృషి ఫలిస్తే వాల్మీకులంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గంగన్న, జిల్లా ఉపాధ్యక్షుడు చిలకల రవి పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలోని బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాల్లోకి చేరుస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయడంపై మండల బోయ వాల్మీకి కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని రత్నగిరి ప్రధాన రోడ్డు పక్కన గల మహర్షి వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకుని పూలమాల వేసి పూజలు చేశారు. తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం జగన్ నేరవేర్చారని తెలిపారు. బోయ, వాల్మీకి కులస్తులు జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ నాగేంద్ర, రత్నగిరి సర్పంచ్ చిన్నరంగప్ప, రొళ్ల ఎంపీటీసీ సౌమ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, నాయకులు ప్రకాష్‌గౌడు, మహంతేష్, కాటప్ప, బొమ్మన్న, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిగి/పెనుకొండ: రాష్ట్రంలో దళిత క్రిస్టియన్లు ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పెనుకొండ నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్, బైబిల్ మిషన్ చర్చ్ ఫాస్టర్ రెవ ఎన్‌జీ సుధాకర్ తెలిపారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి క్రైస్తవ మత పాస్టర్లకు తోడుగా నిలుస్తున్నారన్నారు.


అగళిలో జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న వాల్మీకులు

28న వైఎస్సార్ ఆసరా సంబరాలు

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 28న ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాలను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం జయచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే తిప్పేస్వామి రాక

గుడిబండ: ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆదివారం మండల కేంద్రానికి వస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. గుడిబండకు నూతనంగా మంజూరైన ఐసీడీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


సరస్వతీ పూజలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు

అమరాపురం: మండలంలోని వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ విగ్రహానికి ప్రత్యేకంగా అభిషేకం, పూజలు నిర్వహించారు. సరస్వతీ మంత్రాన్ని విద్యార్థులతో పఠించారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి, వందశాతం ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. పాఠ్యాంశాలన్నింటినీ రివిజన్ చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఎవరూ భయపడవద్దని, బాగా చదివితే మంచి మార్కులు వస్తాయని తెలిపారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి

మడకశిర రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని మడకశిర రోటరీ క్లబ్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్ వారు అందించిన రూ.లక్ష విలువ చేసే బెంచీలను శనివారం వైబీహళ్లి జిల్లా ఉన్నత పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందుపురం రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ రామచంద్రరెడ్డి, స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు రవిశేఖర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, పుట్టకామప్ప, అశ్వర్థ నారాయణ, అనంతప్రదీప్, ఆదినారాయణ,రాఘువేంద్ర, హెచ్‌ఎం గీత, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తాం


రొప్పంలో మహిళలకు గ్యారంటీ కార్డులు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్

పావగడ: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారెంటీ కార్డుల్లో ఉన్న గృహ లక్ష్మి పథకం కింద ప్రతి ఇంటి యజమానికి ప్రతి నెలా రూ.2 వేల ఆర్థిక సాయం, అన్నభాగ్య పథకం కింద ఇంటిలోని ప్రతి వ్యక్తికి 10 కేజీల బియ్యం, గృహ జ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని స్థానిక విధానసభ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి హెచ్.వి వెంకటేశ్ తెలిపారు. పట్టణ సమీపంలోని పి రొప్పం గ్రామం ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేడీఎస్ పార్టీకి ఓటు వేయవద్దని, వేస్తే ప్రభుత్వానికి మద్దతిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాను కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తెలిపారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే గుట్టహళ్ళి, రైన్ గేజ్ తదితర వార్డుల్లో పర్యటించి గ్యారెంటీ కార్డులను అందించారు. మెహర్ బాబా దేవాలయం వద్ద జేడీఎస్‌కు చెందిన 300 కుటుంబాలు వెంకటేశ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంకటరమణప్ప, కాంగ్రెస్ నాయకులు శంకరరెడ్డి, రాజేశ్, లాయర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు నాగభూషణ రెడ్డి, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కమనీయం.. జ్యోతుల ఉత్సవం


జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోట గ్రామంలో తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరి దేవికి శనివారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పంచ జ్యోతులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం నోటి తాళం ఆచారంతో భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామంలో శాంతి, సౌహార్ధతలు కాపాడుకునేందుకు, దుష్ట శక్తుల నుంచి రక్షించడానికి అమ్మవారికి పంచ జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించామని తొగటవీర యువ జన సంఘం నాయకులు తెలిపారు.

‘వైఎస్సార్ ఆసరా’తో మహిళలకు భరోసా


హిందూపురం: మహిళా సంఘాలకు రుణ విముక్తి పత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ


రొద్దం: కోగిరలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో డ్వాక్రా సంఘాల మహిళలు సంతోషంగా ఉన్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మెన్లు జబివుల్లా, బలరామిరెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీకి సంబంధించి 16,925 మంది పొదుపు సంఘాల ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా మూడో విడతగా రూ.13.69 కోట్లు జమ అయ్యాయి. అనంతరం జరిగిన సమావేశంలో డ్వాక్రా సంఘాల లీడర్లకు వైఎస్సార్ ఆసరా రుణవిముక్తి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య లీడర్లు మల్లికాబేగం, మెప్మా టీపీఓ కిష్టప్ప సీఎంఎం హరినాథ్‌రెడ్డి, మెప్మాసీసీలు, ఆర్‌పీ పాల్గొన్నారు.

మడకశిర/అమరాపురం/రొద్దం: మడకశిర నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథక కింద డ్వాక్రా సంఘాలకు రూ.28.70 కోట్ల రుణమాఫీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శనివారం బటన్ నొక్కి డ్వాక్రా సంఘాల ఖాతాల్లోకి రుణమాఫీ డబ్బు జమ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 4,357 సంఘాలకు లబ్ధి చేకూరింది. గుడిబండ మండలంలో 840 సంఘాలకు రూ.6.21 కోట్లు, అమరాపురం మండలంలో 895 సంఘాలకు రూ.7.43 కోట్లు, మడకశిర మండలంలో 995 సంఘాలకు రూ.5.76 కోట్లు, రొళ్ళ మండలంలో 574 సంఘాలకు రూ.2.61కోట్లు,అగళి మండలంలో 626 సంఘాలకు రూ.3.74 కోట్లు, మడకశిర మున్సిపాలిటీ పరిధిలో 427 సంఘాలకు రూ.2.93 కోట్లు చొప్పున రుణమాఫీ అయింది. అలాగే రొద్దం మండలంలోని పలు గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలు సీఎం వైఎస్ జన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కంప్యూటర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ: కంప్యూటర్ అధ్యాపక పోస్టుకు అర్హులైన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి శనివారం తెలిపారు. డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో బోధించేందుకు ఎంసీఏ కంప్యూటర్ సైన్స్ లేదా ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ అర్హత కలిగిన వారు అర్హులన్నారు. కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే మౌఖిక పరీక్షకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440216040 నంబర్ సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

హిందూపురం టౌన్: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సూగూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు వెంకటరమణ శనివారం ప్రారంభించారు. ఏటా యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో పలు రద్దీ ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని సమితి అధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్ అన్నారు. త్వరలో 14 చోట్ల చలివేంద్రాల ఏర్పాటు చేసి మినరల్ వాటర్ అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మీ మోహన్, రామాంజి, చంద్ర, వెంకటేష్, అంజన్ రెడ్డి, రాము, బాబన్న, ఫణి, నాగరాజు, బసప్ప, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం, గుట్టూరుకు చెందిన విద్యార్థులు నాగభరత్, ఉషశ్రీ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కి ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

నేడు హిందూ సాదర కులస్తుల సమావేశం

రొళ్ల: మండల పరిధిలోని కాకి మల్లేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు హిందూ సాదర కులస్తుల తాలూకా స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మడకశిర తాలూకా హిందూ సాదర కులస్తుల సంఘం కార్యదర్శి విజయరంగేగౌడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సంఘం బలోపేతం, వివిధ విధానాలు సభ్యుల పనితీరు, ఇతరాత్ర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

మడకశిర(అగళి): అగళి మండలంలోని పీబ్యాడిగెర అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార ప్రాధాన్యతను స్థానిక ప్రజా ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచు నరసమ్మ,ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, స్థానిక నాయకులు మధు,సురేష్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పరిగి: మండలంలోని పి నరసాపురం పంచాయతీ పరిధిలోని ఎస్ బీరేపల్లిలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. తొలుత మహిళా చైతన్యంపై గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మడకశిర ఏరియా ఏటీఎల్ నారాయణస్వామి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించి, అన్ని విధాలా ఎదగాలన్నారు. మహిళల్లో చైతన్యం వచ్చినపుడే సమాజంలో విలువలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి నేత్రావతి, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, సీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద శనివారం వారపు సంత, జంతు వధశాల, కాంప్లెక్స్ రూములకు వేలం పాట నిర్వహించారు. వారపుసంతను మక్బుల్ అనే వ్యక్తి రూ.2.72 లక్షలకు దక్కించుకున్నారు. జంతు వధశాలను రూ.2,600, 14 షాపింగ్ కాంప్లెక్స్ రూములకు గాను 9 రూములను రూ.62 వేలకు పలువురు దక్కించుకున్నారు. బస్టాండ్, ఐదు రూముల వేలం వాయిదా పడినట్లు కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ సంధ్య తెలిపారు.

వలంటీర్లకు ఉత్తమ ఆపదమిత్ర అవార్డులు


రొళ్ల: జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పరమేష్

రొళ్ల/చిలమత్తూరు: అనంతపురం టీటీడీసీలో పన్నెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 108 మంది వలంటీర్లను ఎంపిక చేసుకుని ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, డీఆర్డీఏ అధికారులు, రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా ఆపత్కాల సమయంలో జరగబోయే నష్టాన్ని ఏవిధంగా తగ్గించాలన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. రొళ్ల మండలంలోని రత్నగిరి సచివాలయం పరిధిలోని పని చేసే వలంటీర్ పరమేష్‌కు ఉత్తమ ఆపదమిత్ర అవార్డును జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ అందజేశారు. అలాగే చిలమత్తూరు మండలానికి చెందిన వలంటీర్ దేవనాథ్‌రెడ్డి కూడా అవార్డు అందుకున్నాడు. కార్యక్రమంలో సీఈఓ భాస్కర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త కార్యదర్శి విశ్వనాథ్, ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్‌దాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

గోరంట్ల: మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసులు తెలిపారు. పుట్టపర్తి 133 కేవీ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల నేపథ్యంలో గోరంట్ల సబ్‌స్టేషన్‌తో పాటు మండలంలోని ఇతర సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని సూచించారు.

నీటి తొట్టెల ఏర్పాటు

పెనుకొండ: పట్టణంలో పశువులు, కోతులు వేసవి తీవ్రతతో అల్లాడిపోతున్నాయి. తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో చిన్నాంజినేయులు కమాన్‌వీధి ప్రాంతంలో పలు నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. క్రమం తప్పకుండా నీటిని నింపుతున్నారు. పశువులు, కోతులు, పక్షులు సంతోషంగా దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

చక్కగా బోధిస్తే ఉత్తమ ఫలితాలు


రాగిజావ పంపిణీని పరిశీలిస్తున్న డీవైఈఓ రంగస్వామి

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం పెనుగొండ డీవైఈఓ రంగస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన ప్రదానోపాధ్యాయులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తరగతుల వారీగా ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు చక్కగా బోధన చేయాలని సూచించారు. విద్యార్థుల స్థాయికి తగిన విధంగా బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఏజెన్సీలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్ర కుమార్, సాయిప్రసాద్, కృష్ణమూర్తి, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పులమతిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరిసర ప్రాంతాల్లో శనివారం హిందూపురం పట్టణంలోని బాలాజీ విద్యావిహార్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం వారం రోజుల పాటు జరుగుతుందన్నారు. విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, పీఈటీ చంద్రశేఖర్, మురళీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.